06ATP27_06ATP27.qxd 03-01-2024 PM 10:57 Page 1



## వారు పరిటాల శ్రీరామ్ అనుచరులుగా చెప్పుకునే వైసిపి నాయకులు

**- వారందరూ టిడిపికి వెన్నుపోటు పొడిచిన వారే**

**- గోనుగుంట్ల వర్గీయుల ఆవేదన**

ధర్మవరం టౌన్, జనవరి 3 ప్రభాతవార



మాట్లాడుతున్న గోనుగుంట్ల వర్గీయులు

మాజీ ఎంఎల్ఎ గోనుగుంట్ల సూర్య నారాయణ పాలనలో పెద్దఎత్తున లబ్ధిచేకూరే అనేక వ్యక్తిగత పనులు చేయించుకున్న పరిటా ల శ్రీరామ్ అనుచరు లుగా చెప్పుకునే కొందరు వైసిపి నాయకులకు గోనుగుంట్ల మంచివారుగా కనిపించారు.... అయితే నిబంధనలకు విరుద్ధంగా చేయకూడని పనులు చేయాలని వత్తిడి చేసినా చేయకపోవడంతో వారి దృష్టిలో గోనుగుంట్ల బహు చెడ్డవారుగా మారారు. అంటూ గోనుగుంట్ల సూర్యనారాయణ అనుచరులు విమర్శించా రు. మంగళవారం గోనుగుంట్లపై పరిటాలఅనుచరులుగా చెప్పుకునే విజయ్ కుమార్, ఫణికుమార్, చంద్రమోహన్‌బాబు, మద్దిలేటి, రామాంజనేయులు, గొట్లూరు శ్రీనివాసులు చేసిన ఆరోపణలను గోనుగుంట్ల అనుచరులు అరవిం దరెడ్డి, తుంపర్తి పరమేష్, చంద్ర, గిరిధర్, నారాయణస్వామి, సూర్యనారా యణ, గొట్లూరు వెంకటేష్, నబీరసూల్ బుధవారం తిప్పికొట్టారు. అడిగిన న్నిపనులు చేయనందున కొందరు టిడిపిని వీడి గోనుగుంట్లకు దూరమై వైసిపి తీర్థంపుచ్చుకుని ఆపార్టీ విజయానికి పాటుపడిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. తిరిగి ఇప్పుడు పరిటాల శ్రీరామ్ పంచన చేసి గోనుగుం ట్లపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. వీరు టిడిపిని వెన్నుపోటు పొడిచేవారేనని, వారితో జాగ్రత్తగా ఉండాలని వారు పరిటాల శ్రీరామ్‌కు సూచించారు. మాజీ ఎంఎల్ఎ గోనుగుంట్ల జయమ్మ కుమారుడు విజయ్‌కుమార్ 14 సంవత్సరాల పాటు టిడిపికి దూరమై ఇప్పుడు పరిటాల చెంతన చేరి అంతాతానై ప్రవర్ధిస్తున్నాడని వారు విమర్శించారు. సర్వసాధారణంగా ప్రతిపక్షం వారు అధికారపక్షంపై విమర్శలు చేస్తారని, అందుకు విరుద్ధంగా పరిటాల అనుచరవర్గం మరో ప్రతిపక్ష నాయకునిపై ఆరోపణలు చేయడం విడ్డూరమన్నారు. వీరి చరిత్ర ఎవరికి తెలియదని వారు దుయ్యబట్టారు. సుధీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన పరిటాల కుటుంబం ధర్మవరంలో లాలూచీ రాజకీయం చేయలేదని చెప్పగలరా అంటూ వారు ఘాటుగా ప్రశ్నించారు. ఏ నియోజకవర్గంకు వెళ్ళినా వారు తెలుగుదేశమేతర పార్టీలతోనే జతకడతారన్నది నగ్నసత్యమన్నారు. పౌరసరఫరాల కాంట్రాక్ట్ ఇంకా పరిటాల కుటుంబం వద్దనే ఉండటంలో అంతర్యమేమిటన్నారు. ఇది లాలూచీ రాజకీయం కాదా అన్నారు. పక్కరాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ కాళ్ళు పట్టుకుని జగన్‌తో సిఫారసు చేయించుకుని వ్యక్తిగత పనులు జరుపుకుంటున్న పరిటాల కుటుంబాన్ని ఏమనాలని వారు ప్రశ్నించారు. గోనుగుంట్ల హయాంలో అనేక కాంట్రాక్ట్ పనులు చేసి కోట్లకు పడగలెత్తిన మొదటి వ్యక్తి గొట్లూరు శ్రీనివాసులు నేడు గోనుగుంట్లను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. వంద కోట్లు పెట్టి టిడిపి సీటు కొంటానని గోనుగుంట్ల సూరి అన్నట్లు నిరూపిస్తే తాము రాజకీయాల నుండి తప్పుకుంటామని వారు సవాలు విసిరారు. గోనుగుంట్లను అబాసుపాలు చేయాలని చూస్తున్నారని అది ఎప్పటికీ నెరవేరదన్నారు. ఆక్రమించుకున్న అసైన్డ్ భూములను పేదలకు ఇళ్ళపట్టాలుగా ఇచ్చే క్రమంలో చేసిన భూ సేకరణలో భూమి పోయిందన్న కోపంతో మాజీ ఎంపిపి మద్దిలేటి టిడిపి నుండి వైసిపిలో చేరిన విషయం అందరికీ తెలిసిన విషయమేనన్నారు. గోనుగుంట్లను నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నట్లు తెలుసుకున్న పరిటాల వర్గం ఆందోళనకు గురవుతోందని, దీంతో లేనిపోని విమర్శలు గుప్పిస్తున్నారని వారు ఆరోపించారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేద్దాం..!

**- ఒక్కో మండలం నుండి 3వేల మందికి జనం తగ్గకూడదు**

**- సమీక్షా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ, జనవరి 3 ప్రభాతవార్త

ఈనెల 7న ఉరవకొండలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో బుధవారం ఆయన బెలుగుప్ప, వజ్రకరూరు, ఉరవకొండ మండలాల ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులతో బస్సు యాత్రపై సమీక్షా సమావేశం నిర్వహించి కార్యక్రమం నిర్వహణ, ఏర్పాట్లు, జన సమీకరణ, రూట్ మ్యాప్, భోజన ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మండలం నుండి 3వేల మందికి తగ్గకుండా జనాన్ని పిలుచుకొని రావాలని, పట్టణం నుండి ప్రత్యేకించి మరో మూడు వేల మంది ప్రజలు సభకు వచ్చేలా చూసుకోవాలన్నారు. బస్సు యాత్రకు వచ్చిన జనానికి ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ బీసీ, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు సి.పి.వీరన్న, యం.బసవరాజు, మాజీ ఎంపీపీ చందా చంద్రమ్మ, పంచాయతీ ఉప సర్పంచ్ జి.వన్నప్ప, పార్టీ పట్టణ అధ్యక్షులు ఏ.సి.ఎర్రిస్వామి, మండల సమన్వయకర్త మూలగిరిపల్లి ఓబన్న, మాజీ జెడ్పీటీసీ ఎస్.తిప్పయ్య, ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్, టౌన్ బ్యాంకు మాజీ అధ్యక్షులు సాదు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

**- ఘనంగా సావిత్రిబాయి పూలే 193వ జయంతి**

ఉరవకొండ, జనవరి 3 ప్రభాతవార్త

వజ్రకరూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే 193వ జయంతిని పురస్కరించుకొని అమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.టి.డి.వి.రంగప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంతర్జాతీయ సేవా భారతి అవార్డు గ్రహీత ఎం.పి.మల్లికార్జున, రిటైర్డు ఎంపిహెచ్‌ఈఓ, వైసీపీ మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు హాజీ పట్టా ఖాజీపీరా తదితరులు మాట్లాడుతూ భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి అయిన సావిత్రిబాయి పూలే కుల మత బేధాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి అన్నారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె తన భర్త జ్యోతిరావ్ పూలేతో కలిసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటిగా బాలికల పాఠశాలను ప్రారంభించిందన్నారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, సూద్రుల, అస్ప ృశ్యులు, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయడం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు భాగ్యరేఖ, కౌసల్య, అరుణకుమారి, అశోక్‌కుమార్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## దేశంలోనే అత్యధికంగా రూ.3వేలు ఫింఛన్ ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్..!

**- మాటిస్తే మడమ తిప్పని నేత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి - ప్రతినెలా 66.34 లక్షల మంది రూ.2వేల కోట్ల రూపాయలు పంపిణీ - వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి**

ఉరవకొండ, జనవరి 3 ప్రభాతవార్త



3వేల రూపాయల పింఛన్‌ను లబ్దిదారులకు అందిస్తున్న ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరామిరెడ్డి



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డికు కృతజ్ఞతలు చెబుతున్న లబ్దిదారులు

దేశంలోనే అత్యధికంగా 3వేల రూపాయలు సామాజిక భద్రత పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి మాటిస్తే మడమ తిప్పరని ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరామిరెడ్డి అన్నారు. వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో బుధవారం జరిగిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా అక్కడ సర్పంచ్ ఇందిరమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వై.శివరామిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని 66.34 మంది లబ్దిదారులకు ప్రతినెలా 2వేల కోట్ల రూపాయల పింఛన్ అందిస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వం ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు వెయ్యి రూపాయలు పింఛన్ ఇచ్చి ఈ తరువాత రెండు వేలు చేసిందన్నారు. ఎన్నికలకు 6 నెలల ముందు వరకు కేవలం 39 లక్షల పింఛన్లు మాత్రమే టీడీపీ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. నేడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు 3వేల రూపాయలకు పెంచి కచ్చితంగా ప్రతినెలా 1వ తేదీనే వాలంటీర్లను ఇంటివద్దకే పంపి అందజేస్తున్నారన్నారు. గత టీడీపీ హయాంలో పింఛన్‌దారులు ఎవరైనా చనిపోతే తప్ప కొత్త పింఛన్ మంజూరు అయ్యేది కాదని అది కూడా జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. నేడు పార్టీలు, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా నేడు పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు. టీడీపీ, వైసీపీ ప్రభుత్వానికి మధ్యగల తేడాలను గమనించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిను మరోకమారు ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలలిత, ఎంపీటీసీలు మునయ్య, ముద్దయ్య, గ్రామ పెద్దలు లాలెప్ప, రామచంద్ర, పాపన్న, గురు, సచివాలయ సిబ్బంది, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## డ్రైవర్లపై కఠిన చర్యల కోసం తీసుకొచ్చిన నల్లచట్టాలు రద్దు చేయాలి

**- తహశీల్దార్ కార్యాలయం ముందు డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ ధర్నా**

ఉరవకొండ, జనవరి 3 ప్రభాతవార్త



సీఎస్‌డీటీ కంబక్కకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

వివిధ వాహనాల డ్రైవర్లపై కఠిన చర్యల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్లచట్టాలను రద్దు చేయాలని డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. బుధవారం పట్టణంలోని స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం ముందు అసోసియేషన్ ధర్నా నిర్వహించింది. ఈ సందర్బంగా అసోసియేషన్ బాధ్యులు కప్పట్రాళ్ల జాఫర్‌వలి, ఎ.అబ్దుల్లా, మహబూబ్‌ఖాన్, హోతూరు బాషా, బి.ఎస్.వి.నబి, సుధాకర్ తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలకు సంబంధించి కొత్త చట్టాలను డ్రైవర్లపై ప్రయోగించడానికి సన్నద్ధం చేస్తోందన్నారు. ఈ చట్టం అమలు జరిగితే ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో సదరు డ్రైవర్‌కు 7 లక్షల రూపాయలు జరిమానా, 7 సంవత్సరాల శిక్ష పడుతుందన్నారు. ఈ చట్టం డ్రైవర్ల మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ మా అవేదనను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చట్టాలు రద్దు అయ్యేలా చూడాలని కోరారు. ధర్నా అనంతరం సీఎస్‌డీటీ కంబక్కకు వినతిపత్రం అందజేశారు.

## డా॥బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం 3, 5వ సెమిస్టర్ పరీక్షలు

**-ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ**

ఉరవకొండ, జనవరి 3 ప్రభాతవార్త

డా॥బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం 3, 5వ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 16వ తేదీ నుండి నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ తెలిపారు. బుధవారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 3వ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 16 నుండి 22 వరకు, 5వ సెమిస్టర్ పరీక్షలు 26 నుండి మార్చి 3 వరకు జరుగుతాయన్నారు. పరీక్ష ఫీజును ఈనెల 17వ తేదీలోపు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సైన్సు విద్యార్థులు తీరితోపాటు ప్రాక్టికల్ పరీక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. హాల్ టికెట్స్ పరీక్షకు మూడు రోజుల ముందు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బిఆర్ఎఓయుఆన్‌లైన్.ఇన్ నుండి పొందవచ్చని తెలిపారు. వివరాలకు అధ్యయన కేంద్రంలోగాని, సెల్ నంబర్ 73829 29762 ద్వారా గాని తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థులు పరీక్షలకు యూనివర్సిటీ ఐడీ కార్డు, హాల్ టికెట్స్ తప్పకుండా తీసుకొని రావాలని తెలిపారు. యూనివర్సిటీ ఐడీ కార్డులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బిఆర్ఎఓయుఆన్‌లైన్.ఇన్ వెబ్‌సైట్ నుండి పొందవచ్చునని ప్రిన్సిపాల్ తెలిపారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు

**- స్టేషన్ ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు**

అగళి, జనవరి 3 ప్రభాతవార్త



స్టేషన్ ముందు ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గత 20 రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారానికై డివిజన్ స్థాయిలో బుధవారం ఆర్డిఓ కార్యాలయం ముట్టడికి, కలెక్టర్ కార్యాలయం ముట్టడికి అంగన్‌వాడీ కార్యకర్తలు బయల్దేరుతుండగా ఎస్ఐ లావణ్య, సిబ్బంది అడ్డుకోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు స్టేషన్ ముందు కూర్చున్నారు. అనంతరం తహశీల్దారు కార్యాలయం వద్దకు వెళ్లి ధర్నా కార్యక్రమాన్ని కొనసాగించారు. 21 రోజులుగా ధర్నాలు చేస్తున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తమ సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## పట్టణంలో పాదయాత్రకు శ్రీకారం చుట్టిన పరిటాల శ్రీరామ్

**- పట్టణానికి ప్రత్యేక మేనిఫెస్టో ప్రకటన**

ధర్మవరం, జనవరి 3 ప్రభాతవార్త



పరిటాల శ్రీరామ్‌ని ఆశీర్వదిస్తున్న అర్చకులు



ప్రజలకు మేనిఫెస్టోను వివరిస్తున్న పరిటాల శ్రీరామ్

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు స్పూర్తితో ధర్మవరం పట్టణం కోసం ప్రత్యేకంగా ఒక మేనిఫెస్టోని రూపొందించి అమలు చేయనున్నట్లు పరిటాల శ్రీరామ్ తెలిపారు. పట్టణంలో ఐదు రోజులపాటు పాదయాత్ర చేయడం జరుగుతుందని నియోజకవర్గం తెలిపారు. పట్టణంలో నాయకులతో కలిసి శివానగర్‌లో పురాతనమైన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పాదయాత్రను ప్రారంభించారు. బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు ఇంటింటా వెళ్లి మేనిఫెస్టోని కరపత్రాలను పంచుతూ పథకాల ద్వారా కలుగు లబ్ధి ప్రజలకు వివరించారు. పట్టణ వార్డులలో గల సమస్యలు త ఎలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా చక్కటి ప్రణాళికతో ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్, కమతం కాటమయ్య, ఫణికుమార్ పల్లపు రవీంద్ర, పల్లపు శివశంకర్, పురుషోత్తం గౌడ్, పరిసే సుధాకర్, నాగూరు హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, బోయ రవిచంద్ర, బొట్టు కృష్ణ, మహేష్, ఇర్షాద్, గోసల శ్రీరాములు, అత్తార్ రహీం బాషా, బాబ్జి అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగంపై నిరంతరం అవగాహన : ఆర్డిఓ రమేష్‌రెడ్డి

ధర్మవరం, జనవరి 3 ప్రభాతవార్త



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఆర్డిఓ రమేష్‌రెడ్డి

రాబోవు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి ఆర్డిఓ కార్యాలయంలో గత పది రోజులుగా ఈవిఎం మిషన్‌పై ఓటును వేసే విధానంపై అవగాహన సదస్సును ప్రతిరోజు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సును నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ఆర్డిఓ రమేష్‌రెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల అధికారి సిబ్బందిచే ఆర్డిఓ కార్యాలయానికి వచుచ ప్రతి ఒక్కరికీ వీటిపై అవగాహన కల్పించడం తద్వారా ఎన్నికల రోజు ఓటును వేయడానికి సులభతరం అవుతుందని తెలిపారు. ఈవిఎం మిషన్‌లో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాడ్ అనే మూడు విభాగాలు ఉంటాయని, ఈ మూడు విభాగాల యొక్క పనితనం గూర్చి కూడా వివరించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి కతిజున్ కుబ్రా, సిఎస్‌డిటి ఈశ్వరయ్య, సిబ్బంది రాజకుమార్, రాజ్యలక్ష్మి, లక్ష్మిదేవి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం, జనవరి 3 ప్రభాతవార్త



మృతి చెందిన వ్యక్తి శ్రీనివాసులు

పట్టణంలో కేశవనగర్‌కు చెందిన లేట్ రామాంజినేయులు కుమారుడు శ్రీనివాసులు(47) బుధవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు మగ్గం నేసుకుంటూ జీవనం కొనసాగిస్తూనే వాడని ఈయనకు భాగ్యమ్మ ఒక కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో శ్రీనివాసులు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు తెలిపిన వివరాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి ఇరుముడి కార్యక్రమం

అగళి, జనవరి 3 ప్రభాతవార్త

అయ్యప్పస్వాములు 41 రోజులు మాల ధరించి దీక్ష చేయడం స్వామిని రథంలో ఊరేగించడంతోపాటు పడిపూజ కార్యక్రమాలు గత రెండు రోజులు ముగించుకున్నారు. చివరి ఘట్టంగా ఇరుముడి కార్యక్రమాన్ని శంకరేశ్వరస్వామి వద్ద ఇరుముడిని స్వాములు కట్టుకుని ఓం స్వామియే శరణమయ్యప్ప శరణ ఘోషతో ఇరుముడిని కట్టుకుని శబరిమలైకు బయల్దేరారు. మాల ధరించిన స్వాముల కుటుంబ సభ్యులు, అక్కడికి చేరుకుని ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జగనన్న సురక్షతో వైద్యసేవలు

గుత్తి, జనవరి 3 ప్రభాతవార్త



మున్సిపల్‌చైర్‌పర్సన్ మాట్లాడుతున్న దృశ్యం

ప్రజలకు భారం కాకుండా ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమీషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక 8వ సచివాలయంలో బుధవారం 15,16 వార్డుల పరిధిలోని ప్రజలకు ఉచిత వైద్యసేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉచితంగా వైద్యపరీక్షలు చేయించుకుని మందులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు బిందుభార్గవి, విష్ణుమూర్తి, లోక్‌నాథ్, కౌన్సిలర్లు వెంకటరమణ, నరేష్, మాతాంగి అంజల, వాల్మీకి శివ, వార్డు సిబ్బంది, సచివాలయం సిబ ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల దీక్షలు



మున్సిపల్ కార్మికులు దీక్ష చేస్తున్న దృశ్యం

గుత్తి, జనవరి 3 ప్రభాతవార్త : తమ న్యాయంనమ్మతమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్ష బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా దీక్షాశిబిరంలో నాయకులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ వర ్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తమ డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్షులు మల్లికార్జున, పారిశుద్ధ్య కార్మికుల సంఘం అధ్యక్షులు నాగరాజు, మోటర్ విభాగం కార్యదర్శి ఖలీల్, సహాయ కార్యదర్శి ఆదినారాయణ, పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాల యందు మహిళా ఉపాధ్యాయుల సన్మానం

అమరాపురం,జనవరి 3,ప్రభాతవార్త:



సన్మానం చేస్తున్న దృశ్యం

మండల పరిధిలోని అమరాపురం ఆదర్శ పాఠశాల యందు ప్రిన్సిపల్ జి.ఓబులపతి ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జన్మదిన సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సమావేశం నందు మహిళాపాధ్యాయురాలు సల్మాబేగం, అమ్మజాన్, నాగవేణి, శ్రీదేవి తదితరులను ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థుల సమక్షంలో సన్మానం చేయడంతో వారు చదువుపట్ల విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్థశాస్త్ర ఆధ్యపకురాలు సల్మా బేగం మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే జీవితంలోని సంఘటనలను బాలికల విద్యాభివృద్ధికి చేసినటువంటి కృషిని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ ఓబులపతి మాట్లాడుతూ సమాజ ఔన్యత్యానికి ఉపాధ్యాయుల కృషి ఎంతగానో ఉందని కొనియాడారు. సమాజంలో మహిళలు అన్ని విధాల, అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వ రిజర్వేషన్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు

అమరాపురం,జనవరి 3,ప్రభాతవార్త:



పూలే చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న దృశ్యం

మండలంలోని స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ శృతివనం నందు మండల దళిత నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా మహాత్మాజ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. అందులో దళిత సీనియర్ నాయకులు నారాయణప్ప మాదిగ, జయకుమార్‌లు మాట్లాడుతూ జ్యోతిరావ్ పూలే గురించి ఎన్నో విషయాలు తెలియజేశారు. అనంతరం ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆమె చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటు కోద్ది నిమిషాలు మైనం పాటించారు. ఈ కార్యక్రమంలో నారాయనప్ప మాదిగ, తిప్పేస్వామి, జయకుమార్, ప్రసాద్, చెన్నప్ప, త్రిలోక్, అగ్రహారం నవీన్, నరసింహామూర్తి, మంజునాథ్, ముద్దరాజు, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ పింఛన్ కానుక నిరుపేదలకు వరం

అమరాపురం,జనవరి 3,ప్రభాతవార్త:



వైయస్సార్ పింఛన్‌కానుక అందజేస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని అమరాపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో జరిగిన వైయస్సార్ పింఛన్ కానుక నిరుపేదలకు వరమని ఎంపిపి ఈరన్న, జడ్పిటిసి స్వారక్క నరసింహామూర్తి, మండల వైకాపా కన్వీనర్ త్రిలోక్‌నాథ్, జేసిఎస్ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సదర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వం కొత్తగా 101 పింఛన్లను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. మండలం మొత్తం ప్రతి నెల 8860 పింఛన్‌లను అందజేస్తున్నట్లు దీనికి 2 కోట్ల 43 లక్షల 24వేలరూపాయలను ప్రభుత్వం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నేటి నుండి 3వేల రూపాయలు జగనన్నప్రభుత్వం ఈనెలనుండి అందజేస్తున్నట్లు ఇది నిరుపేదలకు వరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ డైరెక్టర్లు వీర క్యాతరాయప్ప, సర్పంచ్‌లు హింతేంద్ర, ఎంపిటిసి నారాయణగౌడ్, జయరాం గ్రామ కార్యదర్శులు ఈరన్న భాస్కర్, మనోహర్ శర్మ, నరేష్ బాబు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## వార్త దినపత్రిక క్యాలెండర్ అవిస్కరణ

అమరాపురం,జనవరి 3,ప్రభాతవార్త:



క్యాలెండర్ అవిస్కరిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపిడిఓ మునిస్వామి వార్త దినపత్రిక క్యాలెండర్‌ను బుధవారం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి ప్రజల కోసం పనిచేసే దినపత్రికగా వార్త ఎల్లవేళలా ముందంజలో ఉందన్నారు. సమాజంలోని ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారాం దిశగా కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా వార్త దినపత్రిక బృందానికి, యాజమన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం నందు స్థానిక వార్త దినపత్రిక విలేఖరి ఎన్.శివాచారి పాల్గొన్నారు.

## ఎస్‌టియు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

బుక్కపట్నం, జనవరి 03, ప్రభాతవార్త

మండల కేంద్రమైన బుక్కపట్నంలో మండల విద్యాధికారి కార్యాలయం నందు ఎంఇఒ-1 ఎస్.గోపాల్‌నాయక్, ఎంఇఒ-2 మోహన్ బాబు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ కోణంకి చంద్రశేఖర్, ఎస్‌టియు డైరీ క్యాలెండర్ వజ్రోత్సవ చేతి ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్‌టియు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అలాగే ఉపాధ్యాయ సంఘాల విద్యార్థుల అభివృద్ధికి పాఠశాల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చంద్రశేఖర్ మాట్లాడుతూ, 12,13 తేదీల్లో కర్నూలులో నిర్వహించే వజ్రోత్సవ సమావేశాల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మోతాలాల్ నాయక్, మండల కార్యవర్గ సభ్యులు అనిల్‌కుమార్, జనార్ధన్, జయప్రకాష్, నాగరాజు, కవిత, చైతన్యకుమారి, భయన్న, ఉపాధ్యాయులు రామకృష్ణ, రాజేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎష్‌టియయు క్యాలెండర్,డైరీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

07ATP03_07ATP03.qxd 03-01-2024 PM 10:59 Page 1



## వార్త క్యాలెండర్‌ను ఆవిష్కరించిన తహశీల్దార్, ఎస్ఐ



వార్త క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహశీల్దార్ సుమతి



వార్త క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ ధరణిబాబు

**యల్లనూరు, జనవరి 3 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సుమతి, పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ ధరణిబాబు బుధవారం 2024 వార్త నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడూ వార్తలను ప్రచురిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వార్త దినపత్రిక వారధిగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా వార్త యాజ మాన్యానికి, జర్నలిస్టులకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్య క్రమంలో యల్లనూరు మండల వార్త విలేఖరి తిరుపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగుతున్న మాలదారులకు భిక్ష



భిక్ష చేస్తున్న మాలదారులు

**తాడిపత్రిఅర్బన్, జనవరి 3 ప్రభాతవార్త**

పట్టణంలోని శివాలయంరోడ్డులో వెలసిన శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి, శివమాలదారులకు వైకాపా రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న భిక్ష కార్యక్రమం బుధవారం 32వ రోజుకు చేరుకుంది. కార్తీకమాసం పురస్కరించుకుని శివమాల, అయ్యప్పస్వామి మాల ధరించిన మాలదారులకు రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఏటా భిక్ష కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన బిక్షలో హాజరైన వందలాది మంది మాలదారులకు రమేష్‌రెడ్డి స్వయంగా భోజనం వడ్డించారు.

## ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి



సావిత్రిబాయిపూలే జయంతి వేడుకల దృశ్యం

**యాడికి, జనవరి 3 ప్రభాతవార్త**

మండలంలోని రాయలచెరువు గ్రామంలోని న్యూ వికాస్ పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ, ఇన్‌చార్జ్ రజిత సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే గొప్ప సంఘసంస్కర్తగా ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలిగా, రచయిత్రిగా, జాతీయ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలిగా ఎనలేని కీర్తి ప్రతిష్టలు సంపాదించారని, కుల, మతాలకు అతీతంగా నవ సమాజాన్ని నిర్మించిన విజ్ఞానవంతురాలిగా ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన గొప్ప దేశభక్తురాలని ఆయన పేర్కొన్నారు. తన భర్తతో కలిసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించి బాలికల విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేసినట్లు ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్య క్రమంలో మహిళా ఉపాధ్యాయులు అనిత, అమల, గీత, ధరణి, షకీలా, ఆయేషా, జాహ్నవి, సునీత, మనీషా, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## పుట్లూరులో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు



కార్యక్రమంలో పాల్గొన్న హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు

**పుట్లూరు, జనవరి 3 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సావిత్రిబాయిపూలే 134వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సావి త్రిబాయిపూలే గౌరవింపబడిందన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే అందుకు ఆదర్శం సావిత్రిబాయిపూలే అని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు మహిళా ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువకున్ని హతమార్చిన గుర్తుతెలియని వ్యక్తులు

**తాడిపత్రిఅర్బన్, జనవరి 3 ప్రభాతవార్త**



తాడిపత్రి పట్టణంలోని మెయిన్‌బజార్ సమీపంలో సయ్యద్‌ఆరీఫ్‌ఖాద్రి అనే యువకున్ని గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం వేటకొడవళ్లతో దాడి చేసి హతమార్చారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి వుంది. యువకునిపై దాడి చేసి హతమార్చిన గుర్తుతెలియని వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలనున్నాయి.

## నేడు పెన్షన్ల పంపిణీ

**పుట్లూరు, జనవరి 3 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు వైఎస్ఆర్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ యోగానందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ పెన్షన్ కానుక 2750 రూపాయలను ప్రభుత్వం జనవరి నుండి 3 వేల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. అదేవిదంగా కొత్తగా మంజూరైన వారికి కూడా పెన్షన్లను పంపిణీ చేయడం జరుగు తుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆయా సచివాల యాల పరిధిలోని లబ్దిదారులు కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని ఆయన కోరారు.

## సజ్జలదిన్నెలో మాజీ ఎంపి జెసి దివాకర్‌రెడ్డి పర్యటన



గ్రామస్తులతో మాజీ ఎంపి జెసి దివాకర్‌రెడ్డి

**తాడిపత్రిరూరల్, జనవరి 3 ప్రభాతవార్త**

మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో బుధవారం మాజీ ఎంపి జె.సి దివాకర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, జె.సి అభిమానుల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపుకు కృషి చేయాలని ఆయన వారికి సూచించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా వుంటామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు వున్నారు.

## వడ్లపాలెంలో పర్యటించిన జె.సి అశ్మిత్‌రెడ్డి



సమస్యలను తెలుసుకుంటున్న జెసి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, జనవరి 3 ప్రభాతవార్త**

పట్టణంలోని వడ్లపాలెంలో బుధవారం తెలుగుదేశం పార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. ఇందులో భాగంగా నిర్వహించిన బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన టిడిపి నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటిస్తూ ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ యోగక్షేమాలు, వారి స్థితిగతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహాశక్తి పథకం కింద 18 నుండి 59 సంవత్సరాలు నిండిన మహిళలకు శ్రీనిధి కింద నెలకు 1500 రూపాయలు, యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు 3 వేల రూపాయలు అందిస్తామని, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, తల్లికి వందనం పథకం ద్వారా ఇంటిలో చదువుతున్న ప్రతి బిడ్డకు ప్రతి ఏటా 15 వేల రూపాయలు, దీపం పథకం పేరుతో ప్రతి ఇంటికి సంవత్సరానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌వైస్‌చైర్మన్లు సరస్వతి, అబ్దుల్‌రహీం, టిడిపి కౌన్సిలర్లు విజయకుమార్, తలారి అరుణ, రసూల్‌బీ, మల్లికార్జున, రమాదేవి, రేష్మపర్వీన్, తస్లీన్‌తాజ్, లక్ష్మీదేవి, షెక్షావలి, తెలుగు మహిళ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి విశ్వభారతి, టిడిపి నాయకులు బుజ్జి, రామకృష్ణ, తదితరులతో పాటు కార్యకర్తలు, జె.సి అనుచరులు, అభిమానులు, జనసేన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## జూదరుల అరెస్ట్

**- రూ.1340 స్వాధీనం**

**పుట్లూరు, జనవరి 3 ప్రభాతవార్త**

పుట్లూరు చెరువు కట్ట సమీపంలో జూదమాడుతున్న వారిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. జూదమాడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు జరిపి జూదమాడుతున్న 5 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 1340 రూపాయల నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

**5 మంది రౌడీషీటర్ల బైండోవర్ :**

మండలంలోని శనగలగూడూరు, గాండ్లపాడు, మడుగుపల్లి గ్రామాలకు చెందిన 5 మంది రౌడీషీటర్లను బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**- ఎపిఎం రమణప్ప**



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న వెలుగు సిబ్బంది

**ఓబుళదేవరచెరువు, జనవరి 3, ప్రభాతవార్త**

మహిళల సాధికారతకు అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తూ కేంద్ర, రా ష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను మహిళా సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఎపియం రమణప్ప తెలియచేశారు. స్థానిక పల్లవి మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం లక్పతి దీది(మహిళా లక్షాధికారి) అనే పథకంపై గ్రామ సంఘాల సహాయకులు మరియు సిబ్బందికి ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపియం మాట్లాడుతూ.... మహిళలను లక్షాదికారి చేయాలన్న సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఎన్నో రుణాలను అందచేయడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం లక్పతి దీది పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మహిళా సంఘాలలోని ప్రతి ఒక్కరిని లక్షాదికారి చేయడమే ఈ పథకం యొక్క లక్ష్యం అన్నారు. సంఘంలోని ప్రతి సభ్యురాలు కనీసం రెండు నుంచి మూడు సుస్థిర జీవనోపాధి కార్యక్రమాలను ఏర్పాటు చేసుకోవాలని అందుకు అవసరమైన శిక్షణలు, మద్దతు, నిధులను మహిళా సంఘాల గ్రామ సమాఖ్యల ద్వారా సమకూర్చుకుని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోనేలా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామ సంఘాల సహాయకులు మరియు సిబ్బంది మహిళా సంఘాలలో ఉన్న ప్రతి సభ్యురాలిని లక్ష్యాధికారి చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తనకల్లు ఎపియం వెంకటనారాయణ, సీసిలు మునెప్ప, వెంకటరమణ, వేణుగోపాల్, హేమభూషణ, శ్రీనివాసులు, ఎమ్‌ఎస్‌ఏ లక్ష్మి, మరియు గ్రామ సంఘాల వీఓఏలు పాల్గొన్నారు.

## గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**గాండ్లపెంట,జనవరి 3,ప్రభాతవార్త**

గాండ్లపెంట మండలం సామచెనుబైలుకు చెందిన వైసిపి కార్యకర్త చింతలప్ప నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పాల్గొని వారి అతిధ్యాన్ని స్వీకరించారు.ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు,వైసిపి నాయకులు,కార్యర్తలు పాల్గొన్నారు.

## మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



పూలబాల వేస్తున్న ఎమ్మెల్యే

**గాండ్లపెంట,జనవరి 3,ప్రభాతవార్త**

గాండ్లపెంట మండలం మల్లమీదపల్లికి చెందిన రిటైర్డ్ విఆర్వ్ రామచయంద్రారెడ్డి మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరిమార్శించారు.ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు,వైసిపి నాయకులు,కార్యకర్తలు పరిమార్శించారు.

## ఇజితిమాలో పాల్గొన్న ఎమ్మెల్యే



ఇజితిమాలో పాల్గొన్న ఎమ్మెల్యే

**గాండ్లపెంట,జనవరి 3,ప్రభాతవార్త**

గాండ్లపెంట మండల కేంద్రంలో జరుగుతున్న ఇజితిమా నందు కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి పాల్గొన్నారు.ఎమ్మెల్యే ఇజితిమా నందు ప్రభుత్వ తరుపున చేపట్టిన ఏర్పాట్లలో ఏవైనా లోపాలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు.అనంతరం ముస్లీం సోదరులతో కలసి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని,ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసిపికి దాదిరెడ్డి రాజీనామా

**అమడగూరు, జనవరి 3 ప్రభాతవార్త**



మండలంలోని ఏ.కొత్తపల్లి గ్రామానికి చెందిన దాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి వైసిపికి రాజీనామా చేశారు. స్థానిక గంగమ్మ ఆలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి పార్టీ ప్రకటనలకు మాత్రమే పరిమితమని చేతల్లో ఏమిలేదని నాలాంటి వారు పార్టీని నమ్ముకున్న వారు ఎన్నో విధాలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పది మందికి సేవ చేసే బాధ్యత పది మందికి ఇచ్చిన మాట నెరవేర్చ లేకపోతే మాతో వచ్చిన వారికి మేము ఏమి సమాధానం చెప్పాలన్నారు. పార్టీ మమ్ములను గుర్తించనప్పుడు ఆ పార్టీలో ఎన్ని సంవత్సరాలు వున్నా ప్రయోజనం లేదన్నారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేసినా మా కష్టం విలువ ఎవరు గమనించలేదని కావునా వైసిపికి రాజీనామా చేసి కార్యాచరణ గురించి త్వరలో తమ సన్నిహితులు, శ్రేయోభిలాషులు, గ్రామస్తులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## మండల బిజెపి నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ ఎన్నుకున్న దృశ్యం

**అమడగూరు, జనవరి 3 ప్రభాతవార్త**

అమడగూరు మండల బిజెపి కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. బిజెపి జిల్లా అధ్యక్షురాలు పురందేశ్వరి, జిల్లా అధ్యక్షులు సిఎం శేఖర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని శ్రీచౌడేశ్వరి కళ్యాణమండపంలో మండల అధ్యక్షులు సురేంద్రారెడ్డి అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, రవీంద్ర, సుబ్రమణ్యం, వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా మస్తాన్‌రెడ్డి, రామకృష్ణ, వేమనారాయణ, ఒబిసి మోర్చా అధ్యక్షునిగా తిప్పన్న, ఎస్‌సి మోర్చా అధ్యక్షునిగా నరసింహులు, కిసాన్ మోర్చా అధ్యక్షునిగా వేంనారాయణ, కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, మహిళా మోర్చా అధ్యక్షురాలుగా సుభద్రమ్మ, ఉపాధ్యక్షురాలుగా రత్నమ్మ, యువమోర్చా అధ్యక్షునిగా రవీంద్ర, మైనార్టీ మోర్చా మండల అధ్యక్షునిగా మహబూబ్‌బాషతో పాటు 30 మంది సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం 50 మంది బిజెపిలో చేరారు. ఈ కార్య క్రమంలో సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, రాము, సుబ్బిరెడ్డి, రామయ్య, గంగులప్ప, ఉత్తప్ప, విశ్వనాథ్, శీన, ఒడిసి మండల అధ్యక్షులు రంగారెడ్డి పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందచేసిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

**యల్లనూరు, జనవరి 3 ప్రభాతవార్త**

మండలంలోని తిమ్మంపల్లి గ్రామానికి చెందిన కేతిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స చేయించు కుంటున్నారు. కుటుంబ సభ్యులు సమస్యను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దృష్టికి తీసుకరావడంతో స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 1.50 లక్షల రూపాయలను మంజూరు చేయించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు బుధవారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చెక్కును అందచేశారు.



సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

## జగన్ చరిత్రలో నిలిచిపోతారు

**-ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి**



వృద్ధునికి ఫించన్ అందచేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**తాడిపత్రిఅర్బన్, జనవరి 3 ప్రభాతవార్త**

దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ సారధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగిన వైఎస్ఆర్ పెన్షన్ కానుక కార క్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు ఇచ్చిన హామీ మేరకు జనవరి నుండి 2750 రూపాయల పెన్షన్‌ను 3 వేల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా తాడిపత్రి మండలానికి సంబంధించి ఎంపిడిఓ కార్యాలయంలో, తాడిపత్రి పట్టణానికి సంబంధించి వైఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో పెన్షన్ల పంపిణీ కార్య క్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద ఆయా లబ్ధిదారులకు ఫించన్లు అందచేశారు.

ప్రతిపక్షనేతగా వున్నప్పుడు వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టాక ప్రతి ఏడాది ఫించన్ పెంచుతూ అవ్వాతాతలకు అండగా నిలుస్తున్నారన్నారు. నవరత్నాలు రాష్ట్రంలోని ప్రజలకు ఎంతో మేలు చేరుకూరుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో జెడ్‌పిటిసి రమణమ్మ, ఎంపిడిఓ రంగారావు, ఇఓఆర్‌డి జిలాన్‌బాష, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మార్ట్ ఫోన్‌లలో ఆయుష్మాన్‌భారత్ ఆరోగ్యకార్డులు పొందండి

**బళ్లారి, జనవరి03, ప్రభాతవార్త;**



డాక్టర్ వై.రమేష్‌బాబు

ఏబీవీ ఎంజేవై - సీ ఎంఆర్ కే (ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జనారోగ్య యోజన-ముఖ్యమంత్రి ఆరోగ్య కర్నాటక) పేరిట ప్రభుత్వపు మహత్తర యోజన కింద ఆయుష్మాన్ కార్డులు సార్వజనికులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లలో రిజిస్ట్రర్ చేసుకోవడం ద్వారా కార్డులు పొందవచ్చునని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమాధికారి వై.రమేష్‌బాబు తెలిపారు. ఈ ఆయుష్మాన్ కార్డుల ద్వారా 1650 వివిధ రోగాల శస్త్ర చికిత్స విధానాలకు సంబంధించి బీపీఎల్ రేషన్‌కార్డు కుటుంబాల ప్రజలకు యేటా రూ.5 లక్షల వరకు, ఏపీఎల్ కుటుంబాలకు యేటా రూ.1.5 లక్షల వరకు ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లోనూ, ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ ఉచితంగా చికిత్స సౌలభ్యం పొందవచ్చునని తెలిపారు. కార్డుల్ని పొందేందుకు బీపీఎల్, ఏపీఎల్ కార్డు కలిగిన వారు ఆధార్‌కార్డుతో తమ మొబైల్‌లోనే రిజిస్టర్ చేసుకోవడం ద్వారా కార్డులు పొందవచ్చునన్నారు. గూగుల్ ద్వారా పీఎంజేవై బెనిఫిషరీ పోర్టల్‌ను తెరిచి లాగిన్ చేసుకోవాలని, అనంతరం తమ మొబైల్ నంబర్‌ను నమోదు పరిచి ఓటీపీ ద్వారా లాగిన్ చేసుకోవాలని, తమ రాష్ట్రం, తమ జిల్లాను ఎంపిక చేసుకొని క్లెయిమ్ టైప్ అనేచోట కుటుంబం అని ఎంపిక చేసుకుని ఆధార్ సంఖ్యను నమోదు చేసి సెర్చ్ చేయాలని చెప్పారు. ఇప్పటికే ఈ యోజన కింద ఈ-కేవైసీ లింకు చేసుకుని ఉన్న వారు నేరుగా పోర్టల్‌లో కార్డు జనరేషన్ వెరిఫై అని కనిపిస్తుంది. ఒకవేళ ఇతర యోజనకు కార్డును ఈ-కేవైసీ చేయనిపక్షంలో ఆధార్ ఓటీపీ ద్వారా ఈ-కేవైసీ చేసుకుని కార్డును పొందవచ్చునని డీహెచ్ఓ డాక్టర్ రమేష్‌బాబు ప్రకటనలో తెలిపారు.

## శ్రీకాంత్ పూజారి అరెస్టును ఖండిస్తూ బీజేపీ కార్యకర్తల ప్రతిఘటన



బీజేపీ కార్యకర్తలు ప్రతిఘటన చేస్తున్నప్పటి దృశ్యం

**బళ్లారి, జనవరి03, ప్రభాతవార్త**

హుబ్లీలో హిందూ కార్యకర్త శ్రీకాంత్ పూజారిని అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ, రాష్ట్రంలో పోలీసుశాఖచే శ్రీరామ భక్తులపై జరుగుతున్న దౌర్జన్యాలు తక్షణం ఆపాలంటూ డిమాండ్ చేస్తూ బళ్లారిలోని వందలాది మంది బీజేపీ కార్యకర్తలు ప్రతిఘటన చేపట్టారు. ఈనెల 22వ తేదీన అయోధ్యలో శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన జరుగుతున్న శుభ సందర్భంలో రాష్ట్రంతో పాటు దేశంలోని కోట్లాది మంది హిందువులు, భారతీయులు సంతోష సంబరాల్లో ఉండడం చూసి సహించుకోలేని కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం 31 సంవత్సరాల క్రితం జరిగిన కరసేవ అల్లర్ల ఘటనకు ఊతమిస్తూ హిందూ సంఘ్ పరివార్, హిందూ సంఘసంస్థల కార్యకర్తల్ని అరెస్టు చేసి రాష్ట్రంలోని హిందువుల్లో భయభ్రాంతులకు గురిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం హిందూ వ్యతిరేక ప్రభుత్వంగా దేశంలో ప్రజలకు చూపిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వపు చర్య తీవ్ర ఖండనీయమని తెలిపిన బీజేపీ నాయకులు రాష్ట్రంలో శాంతిభద్రతలు భంగం కలిగించేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.కె.హరిప్రసాద్‌లు ప్రజల్లో విషబీజాలు నాటుతున్నారని ఆరోపించారు. ప్రతిఘటనలో భాగంగా రాష్ట్ర గవర్నర్‌కు రాసిన వినతి పత్రాన్ని జిల్లాధికారికి అందజేశారు. ఈ ప్రతిఘటనలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎం.గోనాళ్ మురహరగౌడ నేతృత్వంలో జరిగిన ప్రతిఘటనలో బీజేపీ నాయకులు డా.మహిపాల్, జి.ఐనాథ్‌రెడ్డి, మహానగరపాలికె బీజేపీ సభ్యులు శ్రీనివాస్‌మోత్కర్, ఎస్.మల్లన్నగౌడ, అనిల్‌నాయుడు, కె.బి.వెంకటేష్‌లతో పాటు వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమాలు

**ఓబుళదేవరచెరువు, జనవరి 3, ప్రభాతవార్త**

మండల పరిధిలోని యం కొత్తపల్లి బండపై వెలసిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మాలదారులకు అన్నదాన వితరణ కార్యక్రమాలు దాతలు సహకారంతో కొనసాగిస్తున్నట్లు ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు తెలిపారు. బుధవారం 48వ రోజు ఓడీచెరువు మండలం హౌసింగ్ ఏఈగా పనిచేస్తున్న హరిప్రకాష్‌రెడ్డి సోదరి వివాహ కార్యక్రమం రోజును పురస్కరించుకుని 208 మంది మాలదారులకు బిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అన్నదాతకు అయ్యప్పస్వాములు అయ్యప్ప ఆశీస్సులు ఎళ్లవేళలా ఉంటాయని ఆశీర్వదించారు.

